# ర్యాగింగ్ బాధితుడు

# అను

# కొత్తల్లుడి గోడు

టి.వి.జి.పాల్

ఫొటోలోని పిల్లను చూడగానే ఆంధ్రా పోలీస్‌కి చిక్కిన అమాయక పౌరుడిలా ఒక్కసారి గుడ్లు తేలేశాడు మా రామలింగేశ్వర్ ముద్దుగా వాడిని రామలింగం అని పిలుస్తుంటాం మేం.

" ఏరా ఈ అమ్మాయి నీకు తెలుసా ? " అనుమానంగా అడిగాను నేను. దానికి జవాబు చెప్పకుండా మళ్ళీ ఓసారి ఫొటో వంక చూసి ఒక్కసారి కెవ్వుమని కేకపెట్టాడు.ఆ దెబ్బతో నాకు రూఢిగా తెలిసిపోయింది. వీడికా అమ్మాయి తెలుసని .

" నీకా అమ్మాయి తెలుసుకదూ ! ఏవైనా అవలక్షణాలుంటే ముందే చెప్పేయ్‌రా

బాబూ! సంబంధం వదిలేసుకుంటాను " నిర్మోహమాటంగా చెప్పాను.

కొంచెం తెప్పరిల్లాక చెప్పాడు.

" ఒరేయ్ ! బాబూ నాకా పిల్ల తెలుసు. ఆ అమ్మాయే కాదు. ఆ అమ్మాయి తాలూకు ఊరివాళ్ళలో సగం మంది తెలుసు . ఆ అమ్మాయికి వంకేం లేదు కానీ, ఆ ఊరి సంబంధం అంటేనే భయం వేసింది "

ఓ విషయం బయట పెట్టాడు రామలింగం.

" ఏం కొంపదీసి ఆ ఊరివాళ్ళు పల్నాటిపులులు, రాయలసీమలోని సమరసింహాలూనా ? కనబడితే కసేకె ్కనా ? " అనుమానంగా, భయం భయంగా అడిగాను.

"అదేం కాదు కానీ ఆ ఊరివాళ్లంత మంచోళ్ళు ఇంకెక్కడా ఉండరు. మంచి స్నేహశీలురు . ఇంతెందుకు ఆ ఊర్నించీ ఇంతకాలంలో ఒక్కరు కూడా పోలీసు ఉద్యోగానికి సెలక్ట్ కాలేకపోయారు. చూశావా ? ఎంతమంచి వాళ్లు"

" మరి సమస్యేమిట్రా " కొంచెం విసుగ్గా అడిగాను.

" అంతా బాగానే ఉంటారు కానీ , కొత్తల్లుడినీ, అదీ సంక్రాంతి పండక్కి పిల్చి మరీ, ఊరంతా ఏకమై ఏదో ఒక పద్ధతిలో ఏడ్పిస్తార్రా ...... ఇదీ ఓ టైపు ర్యాగింగ్ అనుకో. అది సంప్రదాయంట కాపోతే ఆ పండగప్పుడు వీళ్లు ఏ పద్ధతిలో ర్యాగింగ్ చేస్తారో చెప్పలేం. ర్యాగింగ్ చేసేప్పుడు ఏడేళ్ల పాప నుండీ ఎనభై ఏళ్ల ముసలమ్మ వరకూ అంతా ఒకటే, " కొద్దిగా వివరించాడు రామలింగం.

" ఇంకొంచెం వివరంగా చెప్పు " కుతూహలంగా అడిగాను.

“సంక్రాంతి పండగను వాళ్ల ఊరిలో నాలుగురోజులు చేసుకుంటారు . మామూలుగా చేసుకునే మూడు రోజులు కాకుండా భోగి ముందు రోజు కూడా ఆ ఉళ్లో పండగే అది కొత్త అల్లుడిని ఏడిపించే పండగ . ఆ రోజు మాత్రం నిజంగా కొత్త అల్లుళ్ళకి దుర్దినమే . ఆ రోజు తెల్లవారింది మొదలు భోగిమంటలు వేసే వరకు ఏదోక పద్ధతిలో ఏదొ రికించేసుకుంటారు. భోగిమంటలు వేసిన క్షణం నుంచీ ఆ అల్లుడు కూడా ఆ ఊరి పౌరుడై పోతాడు . ఇక అతను కూడా ఆ తర్వాత ఏడాది కొత్త అల్లుడిని ఏడ్పించేందుకు అర్హత పొందుతాడు ” చాలా ఓపిగ్గా , సుబో ధకంగా చెప్పాడు.

కొత్త అల్లుడంటే మరదళ్ళు, బావ మరదులు ఆట పట్టిస్తుండరా ఏంటి? ఇదీ అంతే అనుకుని.......

“ఓస్ ! ఇంతేనా ?ఈ మాత్రం దానికే పే.....ద్ద........ఇదైపోవడమెందుకు ఆ రోజుమానేసి భోగిరోజు వాళ్ల ఊరు వేళ్తే పోలా ? ” అన్నాను నేను కాలేజిలో ర్యాగింగ్ బారినుంచీ తప్పించుకున్నప్పటి అనుభవాల్ని గుర్తు చె సుకుంటూ..

అలా అనుకుంటున్న నా వంక ఓసారి వెర్రి వెధవని చూసినట్టు విచిత్రంగా చూసి విరక్తిగా నవ్వి వేదాంత ధొ రణితో ఇలా చెప్పాడు.

“ పిచ్చివాడా ? అలా చేసి చూడు తెలుస్తుంది . అందరికీ ఇలాంటి ఆలోచన రాకనా ? నువ్వా పండక్కి వెళ్ళలేదనుకో . కనుమ పండగ అయిన మర్నాటి నుంచీ ఆ ఊరి నుంచి ప్రతిరోజూ ఒక్కో కుటుంబం వచ్చి మీ ఇంట్లో దిగబడుతుంది. నీకే సుఖమూ లేకుండా చేస్తుంది” నీకే సుఖమూ లేకుండా చేస్తుంది అన్న మాట వత్తి మరీ చెప్పాడు వాడు.

దాంతో కొద్దిగా భయం వేసింది నాకు.

“ ఎందుకలా చెయ్యటం ? ” అడిగాను నేను

“ అది వారి సంప్రదాయము బాబూ ! నీ కొచ్చిన ఆలోచనలు లాంటివి మరెవ్వరికీ రాకుండా చెయ్యడానికి అలా ఏర్పాటు చేసినారు. అది వారి యొక్క కట్టుబాటు. దానిని ఆ ఊరు ఆడబడుచులెవరూ అనగా పెళ్లై అత్త వారింటికి చేరినవారు అతిక్రమించరాదు నాయనా ..... ” నా సందేహాన్ని పటాపంచలు చేస్తూ స్వామి ఉపన్యాసానంద టైపులో చెప్పాడు రామలింగం.

“మరి ఈ విషయాలన్నీ నీకెలా తెలుసూ ? ” మరో సందేహాన్ని వ్య క్తం చేశాను.

“ పిచ్చివాడా నేనూ ఆ ఊరి అల్లుడినే అందుకే నాకా సంగతులు బాగా తెలుసు ” అంటూ అప్పటి వాడి అనుభవం చెప్పుకొచ్చాడు.

పెళ్లైన కొత్తలో ఇలాగే సంక్రాంతి పండక్కి మావగారింటికి వెళ్ళాట్ట భోగి ముందు రోజు ఒక పదేళ్ల పాప వచ్చి “ ఈ ముగ్గు బాగుందా ? చూడండంకుల్ ” అంటూ ముగ్గు చూపిస్తానని ఎదురింటికి తీసికెళ్ళిందట . వీడు ముగ్గు చూస్తుండగానే ఓ పదిమంది పోగైపోయి అది.......కా....దు , ఇలాక్కాదు అంటూ పిచ్చిపిచ్చి సలహాలిస్తూ వీడిచేత ఓ రెండున్నర గంటల పాటు రథం ముగ్గు వేయిస్తూ వాళ్ళు ఊరిచివరకు చేరె

్చేసారట.పాపం ! వాళ్ళ మావగారు ట్రాక్టర్ వేసుకొచ్చి అందర్నీ మళ్ళీ ఊళ్ళోకి తీసుకెళ్ళార్ట.

ఇంకా వాడు ఆసక్తికరమైన విషయాలెన్నో చెప్పాడు .

ఓసారి ఊళ్ళోని యువకులందరూ చేరి, ఒక కొత్త అల్లుడిని ఉబ్బేసి మీరు మారు వేషం వేస్తే మీ పెళ్ళాం కూడా మిమ్మల్ని గుర్తు పట్టలేద్సార్ అన్చెప్పి వాడిచేత హరిదాసు వేషం వేయించార్ట.

ఇలా ఎన్నో సంగతులు చెప్పాడు కానీ చివర్న చెప్పిన సంగతే నాకు నచ్చింది కొంచెం భయపెట్టింది కూడా .

ఊళ్లో వాళ్ళందరూ అల్లుడిని ఏడ్పించినప్పుడు రహస్యంగా ఫొటోలు తీసి ఊళ్ళోని గ్రంథాలయంలో ప్రదర్శిస్తుంటారు. అదేంటంటే వాళ్ళ హస్యప్రియత్వాన్ని ఆ ఫొటోలు గుర్తు చేస్తుంటాయట . మా రామలింగం ముగ్గువేస్తున్న ఫొటో , హరిదాసు ఫొటో ఇలాగే ఎన్నో ఫొటోలు , పార్లమెంట్ సెంట్రల్ హాల్లో మన జాతీయ నాయకుల ఫొటోలు ప్రదర్శించినట్టు ప్రదర్శిస్తుంటార్ట.

చివరకు వాడు చెప్పిన విషయం ఏంటంటే అప్పుడు వీడిచేత ముగ్గులేయించిన వాళ్ళలో ఈ అమ్మాయి కూడా ఉంది.

అయితే ఇదేదీ నాపెళ్లికి అడ్డురాలేదు. అ అమ్మాయితోనే నా పెళ్ళైపోయింది. తర్వాత సంక్రాంతి పండక్కి ధైర్యంగా అత్తవారింటికి వెళ్ళాను.

జనవరి 14 వ తేదీన భోగి అయితే పన్నెండవ తేదీకే అత్తవారింటికి చేరుకున్న నాకు

'కొత్త అల్లుడిని ఎలా చూసుకోవాలి ? ఎలా మర్యాదలు చేయాలి?' అన్న విషయం వీరి దగ్గర్నుంచే ఎవరైనా నేర్చుకోవాలి అన్నట్టు సాగాయి ఆ మర్యాదలు .

అయితే.....

ముందుందిలే ముసళ్ళ పండుగ అన్న భావం మరదళ్ళు , అత్తమామల ముఖాల్లో లీలగా కనపడడం నా దృష్టిని దాటి పోలేదు. అసలు రేపంటూ నేను ఎవరికైనా చిక్కితేనే కదా ! ఎవరైనా నన్ను ఆటపట్టించేది అనుకుని ధైర్యంగా నిద్రపోయాను.

*********************

అర్థరాత్రి రెండుగంటలకు మెలకువ వచ్చింది నాకు వెంటనే లేచి నేను వేసుకున్న ప్లాన్ అమలులో పెట్టే పనిలో పడ్డాను.

అదేంటంటే ......

మెల్లగా లేచి ఊరు విడిచి పారిపోవడం పక్కనున్న టౌన్కి వెళ్లి ఓ హోటల్లో రూం తీసుకుని , ఓ సినిమా చూసి భోగి రోజు నాలుగ్గంటలకల్లా మళ్లా అత్తవారింటికి వచ్చేయడం .

" ఆహా ! భలే ఐడియాలే నాది " అనుకుంటూ మెల్లగా నడుచుకుంటూ పొలాలకు అడ్డంపడి పక్క టౌన్‌కి బయల్దేరాను .

అయితే ఊరు దాటుతుండగా హఠాత్తుగా రెండు ఆకారాలు నాముందు ప్రత్యక్షమయ్యాయి.

అచ్చం దయ్యాలల్లే ఉన్నాయనిపించింది.

ఉండడమేమిటి ? అవి దయ్యాలే .

వాటిల్ని చాడగానే నాపై పాణాలు పైనే పోయాయి.

అయితే అవి కొంచెం మంచి దయ్యాలట (ఆ సంగతి ఆ దయ్యాలే ఆ తర్వాత చెప్పాయి). కానీ సినిమా పాటలంటే ప్రాణమట . ఒకరోజంతా అవి కోరిన సినిమా పాటల్ని పాడి వినిపిస్తే చాలు ప్రాణాల్తో వదిలేస్తామని చెప్పాయవి.

ఆ పాటలు ఎప్పుడు పాడి వినిపించాలో కూడా అవే చెప్పాయి. ఊరి బయట పొలాల దగ్గరకు మర్నాడు వెళ్లి అవి కోరిన పాటలు మధ్యహ్నాం దాకా వినిపిస్తే చాలట.

బాగా ఆలోచించుకున్నాను.

చివరకు అవి కోరినట్టే "దయ్యాలు కోరిన ఫిలిం రికార్డులు" వినిపించడానికి ఒప్పుకున్నాను.

ఒప్పుకోక ఛస్తానా ?

ఒప్పుకోకపోతే చస్తాను కానీ

మర్నాడు మాత్రం తాము కోరిన పాటల్ని వినిపించకపోతే విరుచుకుతింటామని వార్నింగ్ ఇచ్చేసి ఘుబుక్కున పక్కనున్న మర్రి చెట్టు ఎక్కేశాయి ఆ దయ్యాలు. బహుశా వాటి నివాసం ఆ చెట్టే అనుకుని పరుగు, పరుగున ఇంటికి చేరుకుని ముసుగెట్టేసి నిద్రపోయాను.

*********************

మర్నాడు పొద్దున పొద్దున్నే స్నానం , టిఫిన్ గట్రా పూర్తి చేసేసి సంకేత స్థలానికి చేరుకున్నాను. అక్కడ గట్టు వి ంద సుమారు అరవై సంవత్సరాల వయసు కల ఇద్దరు

పల్లెటూరు బైతులు కూర్చుని చుట్టతాగుతున్నారు. అరవై సంవత్సరాలున్నా బలంగానే ఉన్నారు.కాయకష్టం చె సినందువల్ల కాబోలు అనుకున్నాను.

నన్ను చూడగానే వాళ్లే ఎదురొచ్చి "అయితే వచ్చేశావన్నమాట " అంటూ పలకరించారు.

ముందు వాళ్లే దయ్యాలని నాకు తెలీలేదు. వాళ్ల పలకరింపుని బట్టే తెలిసింది.

“ పగలు పూట దయ్యాలిట్లా తిరుగుతుంటాయా ? ” వాళ్ళెవరో తెలుసుకోవాలన్న అనుమానం తీరక ‘కోడ్ వర్డ్ ’ అడిగినట్టు అడిగా.

వెంటనే ఆ రెండు దయ్యాలూ ఫెళ్ళుమని నవ్వి

“ చూడవోయీ! మీ మనుషులకు భలే విచిత్రమైన నమ్మకాలుంటాయోయ్.దయ్యాలు రాత్రిపూటె ˋ తిరుగుతాయని చెప్పిన మనిషి వెధవెవడోయ్? పగలూ రాత్రీ తేడా లేకుండా మేం ఇలా తిరుగుతూనె ˋ ఉంటామోయ్. మేం కోరుకున్న వాళ్ళకే కనపడతాం . ఇప్పుడు నీకు కన్పిస్తున్నామా ? ఇంకెవరికీ కనబడం హహ్హాహ్హా........ఇక మొదలెట్టు పాటలు హ్హా........హ్హా....హ్హా ” అన్నారు.

వాళ్ళ మాటలకి మళ్ళీ భయమేసి ఇంకెంత మాత్రం ఆలస్యం చేయకుండా పాట పాట్టం లంకించుకున్నాను.

అలా ఆ గాన స్రవంతి సుమారు రెండు గంటల పాటు సాగింది. ఎలుగెత్తి నేను పాడుతున్న పాటలు ఆ చుట్టుపక్కలున్న పొలాలలో ఎవరికీ వినబడలేదు కాబోలు.

నేను ఒక్కణ్ణి అక్కడున్నాననిగానీ , పాటలు పాడుతున్నానన్న స్పృహకానీ లేకుండా వాళ్ళ పని వాళ్ళు చెˋసుకుపోసాగారు.

అనుమానం వచ్చి ఆ దయ్యాలనే అడిగితే

“ ఇదంతా మా మహత్యమే . నువ్వు వాళ్ళకి కనపడవు . నీ పాటలు వినబడవు. రెచ్చిపో ... పులైపో .....నీ అద్భుతమైన గానవాహినిలో మమ్ము ఓలలాడించు” అంటూ ప్రోత్సహించేసరికి దయ్యాల అండ నాకున్నదనె ˋ ఆనందంలో నిజంగానే రెచ్చిపోయి మరో గంటసేపు పాటలు పాడేశాను.

చివరకి పన్నెండున్నరకి ఆ దయ్యాలను వదిలించుకుని ఇంటికొచ్చి భోంచేసేసి నిద్రపోయాను. సాయంత్రం టిఫిన్ , రాత్రి భోజనం తర్వాత నిద్ర అంతే .....

మర్నాడు తెల్లవారుఝామున నాలుగ్గంటలకి మెలకువ వచ్చింది.

**************************

అప్పటికే ఇంట్లో వారందరూ రోడ్డుమీదికి చేరి ’భోగి మంట’ దగ్గర ఉన్నారు.

భోగిమంటని చూడగానే హఠాత్తుగా గుర్తుకొచ్చేసింది ఆ ఊరి ఆచారం నిజంగా ఆనందం కూడా వేసేసింది.

“అమ్మయ్యా ! ఎటువంటి ర్యాగింగ్ లేకుండా బయటాపడ్డా” అని నిట్టూర్చా.

అయితే జరిగిందేమిటి నాకా సాయంత్రం వరకూ తెలియలేదు.

నేను పొలం గట్లమీద పాటలు పాడుతున్న ఫొటో ఒకటి లైబ్రరీలో చేరిపోయింది .

అంటే ఆ దయ్యాలు దయ్యాలు కాదన్నమాట మనుషులే.

అలా దయ్యాలుగా ఆ ఊరి వాళ్ళు నన్ను ఆటపట్టించారు. అర్ధరాత్రి పూట ఊరు విడిచి పారిపోవడం చాలా ఓల్డ్ ట్రిక్కట.

సరే గతం గత: అనుకుని , ఎలాగో నేనూ ఇప్పుడు సీనియర్ అల్లుడిని అయ్యానుగా వచ్చే ఏడు మళ్ళీ అత్తవారింటికి వెళ్ళి అప్పటికి ఆ ఊరి కొత్త అల్లుళ్ళను ర్యాగింగ్ చేసేద్దాం అని కంకణం కట్టుకున్నా.

అప్పటి నుంచీ దాదాపు అదే ధ్యాసతో 11 నెలల 27 రోజులు గడిపేశాను.

" అల్లుళ్ళని ఆట పట్టించడంలో అరవై ఆరు లక్షల విధానాలు " అనే పుస్తకం రాసుకున్నాను. అంటే ఆ సబ్జక్ట్ మీద పిహెచ్. డి చేసేశావన్నమాట.

చివరకు అనుకున్న రోజు రానే వచ్చింది.

ఇక ఇప్పుడు ఏడిపించడం నావంతు అని ఉవ్విళ్ళూరుతూ అత్తవారింటికి చేరాను.

నేను కార్యరంగంలో దిగవలసింది రేపే

అప్పుడు చేరింది నాకు పిడుగుపాటు లాంటి వార్త

ఆ వార్త వింటూనే కుప్పలా కూలిపోయాను. వార్త తలుచుకుని కుమిలి కుమిలిపోయాను.

అదేంటంటే

బిన్ లాదెన్ విషయంలో అమెరికా విదేశాంగ విధానం మారిపోయినట్టే ఆ ఊరి విధానం కూడా మారిపోయిందట.

మరి కొత్త అల్లుడిని ఏడ్పించడం బాగుండదనిపించి , కొత్త అల్లుళ్లే పాత అల్లుళ్లని, ఊరి వాళ్ళని ర్యాగింగ్ చెయ్యాలని ఆ గ్రామ పెద్దలు ఏకగ్రీవంగా నిర్ణయించేసుకున్నార్ట.

అదేమిటి అని ఎవరైనా అంటే.......

కొత్త అల్లుళ్ళని ఏడిపిస్తే వాళ్ళు అలగటం ఇత్యాది ప్రాబ్లమ్స్ వస్తున్నాయట. సరేలే

ఈ గొడవంతా ఎందుకులే అని సంప్రదాయం మార్చేసారట.

ఏం మార్చడమో ఏమో కానీ ఆ వార్త వినగానే నేను మూర్చపోయాను.

ఆ విధంగా ఆ ఊరి గ్రంథాలయంలో కొత్త అల్లుళ్ళలో(ర్యాగింగ్ బాధితుడిగా) చివరివాడిగానూ, పాత అల్లుళ్ళలో మొదటి వాడిగానూ నా ఫొటో చేరింది.